క్లుప్తంగా

కండలేరులో 11.170 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 11.170 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలి



ఆరీఫాకు సన్మానం

రాపూరు: విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత పదవులు అధిరోహించాలని గ్రంథాలయ అధికారిణి ధనమ్మ సూచించారు. ఆదివారం రాపూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వార్డు సభ్యులరాలు ఆరీఫాను ఘనంగా సన్మానించారు.

కెనరా బ్యాంక్ గోల్డ్ లోన్ ర్యాలీ



గోల్డ్‌లోన్‌పై ప్రచారం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

దొరవారిసత్రం: స్థానిక కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆదివారం గోల్డ్ లోన్ అతి తక్కువ వడ్డీతో పాటు అధిక రుణం ఇస్తామంటూ ర్యాలీ చేశారు. అంతేకాకుండా కరపత్రాలను అందజేశారు. తమ బ్యాంకులో ఖాతాలేని వారి కూడా వెంటనే ఖాతాను తెరిచి రుణం ఇస్తామని మేనేజర్ హనుమంత్‌నాయక్ తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నారాయణరెడ్డి, సుధాకర్, బాలాజి పాల్గొన్నారు.

రామ మందిర నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దంపతులు

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో ఆదివారం రామ మందిర నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం దంపతుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాల నడుమ నవగ్రహ పూజలు చేసి సీతారాముల వారి నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

27 విద్యుత్ స్టార్టర్ల చోరీ


పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదీ తీరాన వ్యవసాయ విద్యుత్ మోటార్లకు ఉన్న 27 స్టార్టర్లను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వర్ణముఖినది తీరాన ఉన్న వ్యవసాయ భూములకు సాగునీరు అందించే నిమిత్తం చిల్లకూరు, జీలపాటూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు సాగునీటి మోటార్లకు ఉన్న 27 స్టార్టర్లను చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లాలోని తోట కుటుంబాల వారి కార్తీక మాస వనభోజన మహోత్సవ పూజా కార్యక్రమం ఆదివారం దివ్యారామంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని తోట కుటుంబీకులు అందరూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. నామ గోత్రాలతో తులసి, ఉసిరి మొక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం నిర్వహించారు. తోట వారి ఇలవేల్పు శ్రీభువనేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సౌభాగ్య వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు స్వామి గిరీష్, తోట వారి కార్తీక వనభోజన మహోత్సవం ఆహ్వాన కమిటీ సభ్యులు తోట జయరాం, తోట వీర మనోహర్, రాంసాయి, అమరనాథ్, బాలాజీ, చలం, జయంతి, లోకేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధలయ్య తిరునాళ్లు

- కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు



స్వామి ఆలయానికి వెళ్లే మార్గం

సైదాపురం: పచ్చని ప్రకృతి రమణీయత..మనసు దోచే రమ్యమైన దొరువులు..కనువిందుచేసే ఏత్తైనా కొండలు..ఇక్కడ ప్రతిచెట్టూ పుట్టా, కొండా కోన అన్నీ స్వామి స్వరూపాలే. నిరంతరం ప్రాపంచిక జీవనయానంలో అలసిన మానవాళి సర్వమత సమ్మేళనంగా ఇక్కడకు విచ్చేసి ప్రకృతి సిద్ధమైన ఈ వాతావరణంలో సేదదీరుతారు. ఎన్నో జీవవైవిధ్యానికి నెలవుగా ఉన్న ఒక అద్భుత ఔషధ క్షేత్రమే శ్రీసిద్ధలయ్య క్షేత్రం. కార్తీకమాసంలో జరిగే తిరునాళ్లకు కోనలో భక్తుల కళతో ప్రతి సోమవారం ఐదు వారాల పాటు ప్రత్యేకపూజలతో అలరాలుతోంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిని దర్శించుకునేందుకు జిల్లా ప్రజలే కాక ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వేలాదిగా తరలి వస్తారు. శ్రీసిద్ధలయ్య కోనను కనులారా వీక్షిద్దాం రండి. సైదాపురానికి 5కిలోమీటర్ల దూరంలో ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో శ్రీసిద్ధలయ్యకోన వెలసి ఉంది. దైవాంశ సంభూతులైన ఇద్దరు యోగీశ్వర్లు శ్రీనవకోటి సిద్ధలయ్య, నవనాథు సిద్ధలయ్యతోపాటు వారి ప్రియశిష్యులైన సారంగధరుడు స్వయంభువులుగా వెలసి ఉన్నారు. కోరిన కోర్కెలను వెంటనే ప్రసాదిస్తూ స్వాములవారు తమ మహిమాన్వితం చాటుకున్నారు. సిద్ధలయ్యకోన అంటే భక్తాదులకు ముందుగా గుర్తుకొచ్చేది కార్తీక మాసంలో ఇక్కడ జరిగే తిరునాళ్లు. అందులో భాగంగా నేటి నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం అవుతుంది. కార్తీక సోమవారాల్లో స్వామివారు భక్తకోటికి దర్శనమిస్తారు. ఈఏడాది 4వారాలపాటు తిరునాళ్లు వైభవంగా నిర్వహించేందుకు అలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఆలయం ఏర్పడి 800 ఏళ్ల నుంచి కార్తీక మాసాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

పుష్కరిణిలకు ఓ ప్రత్యేకత..

కోన సమీపంలోనే పుష్కరిణిలు దర్శనమిస్తాయి. ఈపుష్కరిణిలో ఏడాది పొడువునా నీటితో నిండి జీవదొనులుగా భాసిల్లుతున్నాయి. ఈ దొనుల్లో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తుల ప్రగాఢ నమ్మకం. అలాగే స్వామివార్ల వద్ద మంత్ర పుష్ప పూజిస్తే తమ కోర్కెలు తప్పనిసరిగా నెరవేరతాయని భక్తుల నమ్మకం.

5 సోమవారాల్లో కార్తీకమాసం తిరునాళ్లు...

శ్రీసిద్ధలయ్యస్వామి కోనలో కార్తీకమాసం సందర్భంగా 4 సోమవారాలపాటు అత్యంత వైభవంగా తిరునాళ్లు జరుగుతాయి.

సిద్ధలయ్యకోనకు ప్రయాణం ఇలా..

నెల్లూరు నుంచి గూడూరు మీదుగా 53కిలో మీటర్ల దూరంలో ఉన్న సైదాపురానికి చేరుకోవచ్చు. అలాగే నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురానికి చేరుకోవచ్చు. అక్కడ నుంచి ఆటోలో 5కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనవద్దకు చేరుకోవచ్చు. అలాగే కడప నుంచి రాపూరుకు చేరుకుని అక్కడ నుంచి 23కిలోమీటర్ల దూరంలో ఉన్న సైదాపురానికి చేరుకుంటే అక్కడి నుంచి సులభంగా కోనవద్దకు ఆటోలు, కార్లలో సిద్ధలయ్య కోనకు భక్తులు చేరుకోవచ్చు. పొదలకూరు, గూడూరు, రాపూరు మీదుగా సైదాపురానికి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం కలదు.





స్వాములవారు, నవగ్రహాల ఆలయం

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన డిగ్రీ విద్యార్థులను ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వాకాడులో అభినందించారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు అగ్రీ సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించారు. అందులో శివశంకర్‌ప్రసాద్ 8వ ర్యాంక్, ఎస్ మౌనిక 27వ ర్యాంక్, మీనాక్షి 32వ ర్యాంక్ సాధించారు. అలాగే అదే కళాశాలకు చెందిన డిగ్రీ సెకండ్ బీఎస్సీ విద్యార్థిని ఆర్ హిమజ ఎస్‌సీసీలో ఐజీసీ, ఆర్‌డీసీ కోర్సును సికింద్రాబాద్‌లో పూర్తి చేసి 9.72 శాతం మార్కులు సాధించడం, ఎన్‌బీకేఆర్ కళాశా అధ్యాపకుడు మాధవయ్యకు గౌరవ డాక్టరేట్ రావడంతో రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక అభినందనలతో దీవించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, తిరుమూరు కృష్ణారెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, వాకాటి రవి పాల్గొన్నారు.

వైభవంగా కోటి సోమవార పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చిట్టమూరు: మల్లాం గ్రామంలో వెలసియున్న కామాక్షీదేవి సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కోటి సోమవార పూజలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేద మంత్రోచ్ఛరణతో నిర్వహించారు. సాయంకాలం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భరత నాట్యంలో ప్రపంచ రికార్డు



ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

గూడూరు రూరల్: గూడూరుకు చెందిన శ్రీసాయి నృత్య బృంద అకాడమీ, ఐసీఎండీఏ సంస్థ ఆధ్వర్యంలో సంగీత నృత్య మహామహోత్సవం అరిగిరి నందిని స్తోత్రం 10 ప్రపంచ రికార్డ్స్ మెగా ఈవెంట్‌ను ఇటీవల నిర్వహించారు. సంస్థ తరఫున 40 మంది చిన్నారులు భరత నాట్యంలో ప్రతిభ కనబరిచి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈమేరకు ఆదివారం గూడూరులోని శ్రీచైతన్య స్కూల్ ఆడిటోరియంలో అభినందన కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు ప్రశంసాపత్రాలను బహూకరించారు. కార్యక్రమానికి ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్ సిద్ధారెడ్డి, సాయిసత్సంగ నిలయం నిర్వాహకులు కోట సునీల్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత, సంస్థ నిర్వాహకులు పెద్దిశెట్టి శ్రీనివాసులు, శైలజకుమారి పాల్గొన్నారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

డక్కిలి: మండలంలోని నాగవోలు సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వెంకటగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 7వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు శివపార్వతుల కల్యాణం

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసియున్న స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, విశేష అలంకారం, రాత్రి ఉత్సవ మూర్తులైన శివపార్వతులకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో విజేతలుగా నిలవాలి

పెళ్లకూరు: పదిహేనేళ్లు పైబడిన క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో డిసెంబర్ 15 నుంచి 20వరకు గ్రామ సచివాలయ పరిధిలోనూ, 21నుంచి జనవరి 4వరకు మండల స్థాయిలోనూ, జనవరి 5 నుంచి 10వరకు నియోజకవర్గస్థాయిలోనూ, జనవరి 11నుంచి 21వరకు జిల్లా స్థాయిలోనూ, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. అందువల్ల నేటి నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం లేదన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు చేయండి



డ్రాఫ్ట్ ఓటర్ జాబితా సవరణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఉన్న తప్పులను డోర్ టూ డోర్ సర్వేలో పనిచేసే అధికారులు సిబ్బంది సరిచేయాలని గూడూరు ఆర్డీఓ ఎం కిరణ్‌కుమార్ సూచించారు. ఆదివారం గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, బూత్‌లెవల్ ఆఫీసర్లతో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌పై సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఉన్న తప్పులను సరిచేసేందుకు డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫారం-6, 7, వినియోగంపై క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

జాబితాల తయారీలో జాగ్రత్తలు పాటించాలి

చిల్లకూరు: సాధారణ ఎన్నికలకు సిద్ధం అవుతున్న క్రమంలో ఓటర్ల జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పనులు జరుగుతున్న క్రమంలో చిల్లకూరు రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన ఆదివారం తనిఖీ చేశారు. అక్కడ కంప్యూటర్ ఆపరేటర్ దగ్గర కూర్చుని జాబితాలో ఫారం -6, 7, 8, 8ఏలను ఏ విధంగా అప్‌లోడ్ చేస్తున్నారని అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఓటరుకు చెందిన నమోదులో కచ్చితంగా అతని డోర్ నంబర్‌ను వేయాల్సి ఉందని అన్నారు. అలాగే ఒక కుటుంబంలో (డోర్ నంబర్‌పై) 10 మంది ఓటర్లకు పైగా ఉంటే వారికి మరో డోర్ నంబర్‌ను వేయాల్సి ఉందని అన్నారు. జాబితాల తయారీలో పలు జాగ్రత్తలు పాటించేలా చూసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులకు సూచించారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారుల భరోసా కార్యక్రమానికి ఈనెల 21న సూళ్లూరుపేటకు విచ్చేస్తున్న సందర్భంగా సీఎం సభను విజయవంతం చేద్దామంటూ నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చిల్లకూరులోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మహేంద్రరెడ్డి, మండల కన్వీనర్లు వెంకటరత్నం, రఘునాయుడు, పాల్గొన్నారు.

సభను విజయవంతం చేద్దాం

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నియోజవర్గ పరిధిలో తడ వద్ద ఈనెల 21 జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక పిలుపునిచ్చారు. నాయుడుపేటలోని ఆమె నివాసం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహిళా సాధికారతకు పాటు పడుతూ మహిళల పక్షపాతిగా ఉన్న సీఎం జగనన్నకు మహిళలే అండ అని నిరూపించేలా తరలిరావాలన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి వైద్యశిబిరం

డక్కిలి: డక్కిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో 170 మందికి కంటి పరీక్షలు చేశారు. 50 మందికి ఉచితంగా మందులు, 60మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే 35మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి, తిరుపతికి తరలించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎండీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామ్‌నాయుడు, ట్రస్ట్ ఏఓ కృష్ణా గల్లా పాల్గొన్నారు.

సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు



అడుగంటిన నీటిలో గూడబాతులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో సందర్శకుల సౌకర్యార్థం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా వర్షాలను దృష్టిలో పెట్టుకుని చెరువు కట్టపై సందర్శకులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాక్ డస్ట్ వేస్తున్నారు. అంతేకాకుండా కేంద్రంలో విడిది చేసే పక్షులను వీక్షించే వ్యూపాయింట్ల వద్ద కొత్తషెడ్లను నిర్మించారు. అంతేకాకుండా మార్గం మధ్యలో పర్యాటకులు సేద తీర్చుకునే విధంగా బెంచీలు, రచ్చ బండలు వంటివి నిర్మించారు. ఈ సీజన్‌లో సందర్శకుల సౌకర్యాలకు, సదుపాయాలకు రూ.2 లక్షల వరకు వెచ్చించినట్లు ఇన్‌చార్జ్ రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అడుగంటిన నీళ్లు..

వర్షాభావ పరిస్థితులతో పక్షుల కేంద్రంలోని చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. దీంతో గూడబాతులు అడుగంటిన నీటిలో ఈత ఆడుతూ కనిపిస్తున్నాయి. కేంద్రం పరిధిలో ఉన్న అత్తిగుంట, నేరేడుగుంట, మారేడుగుంట చెరువుల్లో తెలుగు గంగ నీళ్లు తీసుకొచ్చేందుకు వన్యప్రాణి అధికారులు కృషిచేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని విహంగాలు పిల్లలను పొదిగి ఉండగా మరికొన్ని విహంగాలు గుడ్లుపెట్టి పొదుగుతున్నాయి.





చెరువు కట్టపై రాక్ దస్ట్ వేస్తున్న సిబ్బంది, చెరువు కట్టపై వ్యూ పాయింట్ల వద్ద షెడ్లు

కమనీయం..కల్యాణం







1: స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం, 2 : అమ్మవార్ల నగరోత్సవం, 3 : స్వామి, అమ్మవార్లకు పుష్పయాగ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: వల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల స్కంధషష్ఠి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. తారకాసుర సంహారం జరిగిన తర్వాత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దేవేంద్రుడి కుమార్తె దేవసేనమ్మతో జరిపిన కల్యాణోత్సవ ఘట్టాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేసి ప్రత్యేక హోమ పూజలను నిర్వహించారు. అలాగే కుంభాభిషేక వేడుకల అనంతరం ఆదివారం కల్యాణ వేంకటేశ్వరస్వామికి సైతం ప్రత్యేక అలంకరణలు చేసి పూజలను నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పుష్పయాగ పూజలను భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగ పూజలను ఉభయదాతలు పెసల కిషోర్‌బాబు, శోభారాణి దంపతుల సారథ్యంలో పుష్పయాగాన్ని నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజున స్వామివార్ల నగరోత్సవాన్ని ఘనంగా జరిపారు.